ఆమె ఒక స్ఫూర్తి

ఆమె ఒక సాధారణమైన గృహిణి. నలుగురికి మంచి చేయాలని పరితపించే వ్యక్తిత్వం. చిన్నారులంటే అమితమైన ప్రేమ. పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన ఆ మహిళ సమాజానికి ఏదైనా చేయాలని పరితపించే వారు. ఇదే తలంపుతో పిల్లలు, మహిళలకు విద్య, ఆధ్యాత్మిక, సాంస్కృతిక అంశాల్లో ఉచిత శిక్షణ అందిస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ సద్గుణాలే నీలాతి వెంకట గుణవతిని ఎందరికో స్ఫూర్తిగా, విద్యా దాతగా నిలిపాయి.

- అందరి మన్ననలు పొందుతున్న వెంకన్నపాలెం మహిళ గుణవతి
- చిన్నారులకు ఉచితంగా విద్యా బోధన
- ఆధ్యాత్మిక, సాంస్కృతిక అంశాల్లో పిల్లలు, మహిళలకు శిక్షణలు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం సమీపాన గల వెంకన్నపాలెంలో నీలాతి వెంకటగుణవతి యాదవ్ అనే గృహిణి తన భర్త, కుమారుడు, కుమార్తె, ఇతర కుటుంబ సభ్యులతో కలిసి 25 ఏళ్లుగా నివసిస్తున్నారు. పోస్ట్ గ్రాడ్యుయేషన్(పీజీ) పూర్తి చేసిన ఆమె తన చదువు ఇంటికే పరిమితం కాకూడదనుకున్నారు. ఇదే తడువుగా వెంకన్నపాలెం, చుట్టుపక్కల గల గ్రామాల ప్రాంతానికి చెందిన కొంత మంది పిల్లలకు ఉచితంగా గణితంతోపాటు ఇంగ్లిష్, సంస్కృతం వంటి భాషలపై బోధన అందించడం ప్రారంభించారు. ఇందుకోసం తన ఇంటినే బడిగా మార్చారు. మల్కాపురం జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలకు వెళ్లి విద్యార్థులకు ఉచితంగా సంస్కృతం, ఆంగ్లం బోధించేవారు.

పిల్లలు సెల్‌ఫోన్ మాయలో పడకుండా..

ఇదే సమయంలో కొందరు చిన్నారుల చేతిలో సెల్‌ఫోన్‌లు ఉండటం, వాటిలో గేమ్స్ ఆడుతూ నిమగ్నమవడం గమనించారు. మొబైళ్లు వారిని ఎంతటి ప్రభావితం చేస్తాయో గుర్తించారు. నేటితరం పిల్లలు సెల్‌ఫోన్ మోజులో పడకుండా వారికి భగవద్గీతలోని శ్లోకాలు, కీర్తనలు, కోలాటం వంటి వాటిలో శిక్షణ ఇచ్చి వారిని మంచి పౌరులుగా తీర్చిదిద్దుతున్నారు. తన ఇంటికి సమీపాన గల కృష్ణాలయంలో చిన్నారులకు భగవద్గీత సారాంశం, దానిలోని శ్లోకాలు, వాటి అర్థాలు వంటివి బోధించటం, శ్లోకాలపై వారంలో ఒక రోజు పరీక్ష నిర్వహించి వారి ప్రతిభకు పదును పెట్టేవారు.

ఆధ్యాత్మికత వైపు మహిళలు

స్థానిక మహిళలపై దృష్టి సారించిన గుణవతి.. వారికి కోలాటం, భగవద్గీత శ్లోకాలు, విష్ణు సహస్రనామాలు, లలితా పారాయణం వంటిఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాల్లో శిక్షణ ఇస్తున్నారు. టీవీ సీరియల్స్‌కు అంకితమైపోయిన మహిళలు.. వాటిని పక్కన పెట్టి కోలాటం, శ్లోకాలు, కీర్తనలు చక్కగా నేర్చుకుంటున్నారు. కృష్ణాలయంలో ప్రతి రోజు మధ్యాహ్నం 30 నుంచి 50 మంది వరకు మహిళలు శిక్షణ పై అంశాల్లో శిక్షణ పొందుతున్నారు. 20 మంది చిన్నారులకు ప్రతి రోజు సాయంత్రం శిక్షణ ఇస్తున్నారు. గృహిణిగా ఉంటూనే నీలాతి గుణవతి.. 10 ఏళ్లుగా ఉచిత బోధన, శిక్షణ కొనసాగిస్తున్నారు.

ప్రశంసలు, సత్కారాలు..

ఆధ్యాత్మిక, సాంస్కృతిక, విద్యా పరమైన కార్యక్రమాల్లో ప్రముఖుల చేతుల మీదుగా నీలాతి వెంకటగుణవతి అనేక ప్రశంసలు, సత్కారాలు పొందారు. కోలాటమాడే మహిళలను తీసుకుని తిరుమల తిరుపతి దేవస్థానం వేడుకలకు వెళ్తుంటారు. అక్కడ వాసుదేవ, అన్నమయ్య కీర్తనామావళి కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. పది మందికి స్ఫూర్తిగా నిలిచిన ఆమెను ఎంతో మంది అభినందిస్తున్నారు.



వెంకట గుణవతి వద్ద ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో శిక్షణ పొందుతున్న మహిళలు



చిన్నారులతో కీర్తనలు పాడిస్తున్న గుణవతి



కోలాటమాడుతున్న మహిళలు

ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలనే ఆశ



మా ప్రాంతం వెంకన్నపాలెం అప్పట్లో ఓ మురికివాడ. ఇక్కడి పిల్లల పరిస్థితిని చూసి వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో నాకు చేతనైనంతలో ఉచిత శిక్షణ అందిస్తున్నాను. ఇటువంటి విద్య, ఆధ్యాత్మిక కార్యక్రమాల వల్ల మానసిక ప్రశాంతతోపాటు ప్రతి ఒక్కరిలో భక్తిభావం పెరుగుతుంది. తద్వారా వారు శాంతిమంతుల్లా మెలిగి, చెడు అలవాట్లకు దూరంగా ఉంటారనే ఆశ. ఇందుకు నావంతు కృషి చేస్తున్నాను.

– నీలాతి వెంకటగుణవతి యాదవ్, ఆదర్శ మహిళ, వెంకన్నపాలెం

శభాష్ సుందరం



ఇందిరానగర్‌ నుంచి గర్భిణీని కేజీహెచ్‌కు తీసుకు వెళ్తున్న ఆటో డ్రైవర్ సుందరం

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు ఇందిరానగర్‌కు చెందిన గర్భిణీని ఉచితంగా కేజీహెచ్‌కు తీసుకెళ్లి తన మానవత్వాన్ని మరోసారి చాటుకున్నాడు ఆటో డ్రైవర్ సుందరం. ఇది ఆయనకు నిత్య కృత్యమే... స్థానిక ఆశావర్కర్లు, ఏఎన్‌ఎంలకు విధి నిర్వహణలో సీరియస్ కేసులు వచ్చినప్పుడు ఆ రోగులను ఆస్పత్రికి చేర్చాలంటే ఆటో సుందరం గుర్తు వస్తాడు. అయితే ప్రస్తుతం ఆయన అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నాడు. ఆ సమయంలో కూడా గర్భిణి పరిస్థితి ఇబ్బందికరంగా ఉందని చెప్పగానే స్పందించి కేజీహెచ్‌కు తీసుకు వెళ్లాడు. విషయం తెలుసుకున్న స్థానికులు సుందరం శభాష్ అంటూ కొనియాడుతున్నారు.

వడదెబ్బకు వ్యక్తి మృతి?

మల్కాపురం: మద్యానికి బానిసై, ఇంటికి దూరంగా ఉంటున్న ఒక వ్యక్తి మరణించిన సంఘటన ఇది. ఐదో పట్టణ పోలీసులు ఆదివారం తెలిపిన వివరాలిలా.. కంచరపాలెం ధర్మానగర్‌లో పిల్లా రజనీకుమార్(50), భార్య రమాదేవి, ఇద్దరు కుమారులతో కలిసి నివసిస్తున్నాడు. ఇతడు మద్యానికి బానిసై భార్యతో మనస్పర్థల కారణంగా ఐదు నెలలుగా ఇంటికి వెళ్లకుండా రోడ్డుపైనే ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో ఊర్వశి జంక్షన్ వద్ద కూర్చుని ఉన్న రజనీకుమార్ ఒక్కసారిగా కుప్పకూలి మృతిచెందాడు. ఎండలకు వడదెబ్బ తగలడం వల్లే మరణించి ఉంటాడని భావిస్తున్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు సీఐ ఎస్.విజయకుమార్ పర్యవేక్షణలో ఏఎస్ఐ రాజారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

నూకాంబికకు ప్రత్యేక పూజలు



అమ్మవారి సన్నిధిలో కార్పొరేటర్ నాగేశ్వరరావు

సింధియా: జీవీఎంసీ 40వ వార్డు ఏకేసీ కాలనీలో కొలువైన నూకాంబిక అమ్మవారి ఆలయంలో అమావాస్య సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్పొరేటర్, ఆలయ ధర్మకర్త గుండపు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, ఆలయ ప్రాంగణంలో దీపాలంకరణ వైభవంగా జరిగాయి. స్థానిక మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సీపీఎం నిరసన నేడు

మల్కాపురం: పెరిగిన విద్యుత్ చార్జీలు, కరెంట్ కోతల సమస్యలపై సీపీఎం మల్కాపురం జోన్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు పార్టీ నాయకుడు ఆర్.లక్ష్మణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. మల్కాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఉదయం 7 గంటల నుంచి ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. పారిశ్రామిక ప్రాంత విద్యుత్ వినియోగదారులు అధిక సంఖ్యలో పాల్గొవాలని ఆయన పిలుపునిచ్చారు.

బాలింతలకు వితరణ



బాలింతకు బ్రెడ్, పండ్లు, చీర అందిస్తున్న విజయ్‌కుమార్ శర్మ

గోపాలపట్నం: గోపాలపట్నం గీతా చానల్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక 30 పడకల ఆస్పత్రిలో బాలింతలకు బ్రెడ్లు, పండ్లు, చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకుడు మండా విజయకుమార్ శర్మ మాట్లాడుతూ ఆస్పత్రిలో బాలింతలకు ఏయే అవసరాలు ఏర్పడతాయో గుర్తించి వాటిని ఇస్తున్నామని తెలిపారు. ప్రతి వారం ఇదే విధంగా అందించేందుకు నిర్ణయించామన్నారు. ప్రతి పాఠశాలలో గీతా పుస్తకాలను పంపిణీ చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో సంస్థ సభ్యుడు వెంకటరమణ, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ ఆర్డీవో

మహారాణిపేట: విశాఖ రెవెన్యూ డివిజనల్ అధికారి డి.హుస్సేన్ సాహెబ్ సోమవారం డయల్ యువర్ ఆర్డీవో కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుంది. గాజువాక, పెదగంట్యాడ, పెందుర్తి, మహారాణిపేట, ములగాడ, గోపాలపట్నం తదితర ప్రాంతాల తహసీల్దార్ల కార్యాలయాల పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం నిమిత్తం ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రజలు 0891–2562977 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యను తెలియజేయాలి.

శ్రావ్యంగా గాత్ర కచేరి



గాత్ర కచేరి చేస్తున్న తేజశ్వరీ, బమ్మిడిపాటి వీణాదరి

మద్దిలపాలెం: విశాఖ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం మద్దిలపాలెం కళాభారతిలో జరిగిన గాత్రకచేరి శ్రావ్యంగా సాగింది. వర్ధమాన గాత్ర కళాకారులు లంక తేజశ్వరీ, బమ్మిడిపాటి వీణాదరి తమ గాత్రంతో అలరించారు. కార్యక్రమంలో కళాభారతి అధ్యక్షుడు ఎంఎస్ఎన్ రాజు, లలిత, చంద్రశేఖర్, వీరఘంట చంద్రశేఖర్, ఎంఎస్ శ్రీనివాస్, అయ్యగారి భుజంగరావు, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



స్వర్ణపుష్పాలకు నమస్కరిస్తున్న భక్తులు



తలంబ్రాల ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 7 నుంచి 8గంటల వరకు స్వర్ణపుష్పార్చన ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అలంకరించి కల్యాణమండపంలోని వేదికపై అధిష్ఠంపజేశారు. 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తరశతనామావళి నిర్వహించి విశేషంగా హారతులు ఇచ్చారు. పూజలో పాల్గొన్న ఉభయ దాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ సూపరింటెండెంట్ పాలూరి నరసింగరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠంపజేసి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయ దాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

అన్ని రంగాల్లో మహిళలదే కీలక పాత్ర

మురళీనగర్: అన్ని రంగాల్లోనూ మహిళలే కీలక పాత్ర వహిస్తున్నారని వుమెన్ క్రికెటర్ షబ్నమ్ తండ్రి మహ్మద్ షకీల్ అన్నారు. ఫాదర్స్ డే సందర్భంగా మురళీనగర్ వనితా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన ప్రసంగించారు. క్రికెట్ ఆడుతూ ఇంటికి వచ్చిన సమయంలో తన తండ్రి గుండెపోటుతో స్వర్గస్థులయ్యారని దీంతో క్రికెట్‌కు గుడ్‌బై చెప్పి ఉద్యోగంలో చేరానన్నారు. అయితే తన కుమార్తెలను క్రికెట్ ప్రాక్టీస్‌కు తీసుకెళ్లినప్పుడు వారిలో ప్రతిభను గమనించి ప్రోత్సహించానన్నారు. ఆడపిల్లలు క్రీడా రంగంలో కూడా రాణించగలరని తన కుమార్తెలు నిరూపించారని చెప్పారు. ఆడపిల్లలు తాము ఎంచుకున్న రంగంలో రాణించేందుకు తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. ఈ సందర్భంగా మహ్మద్ షకీల్‌ను వనితా వాకర్స్ క్లబ్ తరఫున వాకర్స్ డిస్ట్రిక్ట్–101 గవర్నర్ ఉప్పలపాటి శుభ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వి.ప్రభాశర్మ, రోజారాణి, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



మహ్మద్ షకీల్‌ను సత్కరిస్తున్న 101 గవర్నర్ శుభ, వనితా వాకర్స్ క్లబ్ సభ్యులు

గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫెయిర్‌కు విశేష స్పందన

బీచ్ రోడ్డు: విదేశాల్లో విద్యాభ్యాసంపై అవగాహన కోసం ఐవీ ఓవర్సీస్ సంస్థ ఏర్పాటు చేసిన గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫెయిర్–2023కు విశేష స్పందన లభించింది. నగరంలోని ఓ హోటల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన ఎడ్యుకేషన్ ఫెయిర్‌ను ఏయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.కృష్ణమోహన్, జేఎన్‌టీయూ విజయనగరం రిజిస్ట్రార్ డాక్టర్ స్వామి నాయుడు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలని చాలా మందికి ఉన్నా.. ఎలా ప్రవేశం పొందాలి, ఏ విద్యా సంస్థలు మంచివి అనే అంశాలు తెలియక ఇబ్బంది పడుతున్నారన్నారు. అమెరికా, కెనడా, యూకే, ఆస్ట్రేలియా, ఐర్లాండ్‌కు చెందిన 33 ప్రముఖ యూనివర్సిటీలు ఈ ఎడ్యుకేషన్ ఫెయిర్‌కు హాజరై సుమారు 300 మంది విద్యార్థుల సందేహాలు నివృత్తి చేశాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఐవీ సంస్థ వ్యవస్థాపకులు బి.రామ్‌కుమార్, బి.శ్రీనివాసరావు, మార్కెట్ హెడ్ వెంకట రామయ్య, సిబ్బంది పాల్గొన్నారు.



ఎడ్యుకేషన్ ఫెయిర్‌లో సందేహాలు నివృత్తి చేసుకుంటున్న విద్యార్థులు

ఉత్సాహంగా లాంగ్ టెన్నిస్ పోటీలు

సీతమ్మధార: సీతమ్మధార హిల్ వ్యూ పార్కులో ఆదివారం వైఎస్సార్ ట్రోఫీ లాంగ్ టెన్నిస్ పోటీలు నిర్వహించారు. చీఫ్ కోచ్ రామకృష్ణంరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో ఏడేళ్ల నుంచి 12 ఏళ్ల వయసు గల 58 మంది చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి ఏపీ టిడ్కో హౌసింగ్ చైర్మన్ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో యువతను అన్ని రంగాలతోపాటు క్రీడా రంగంలో ప్రోత్సహించేలా అనేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. క్రీడల్లో ప్రతిభ చూపిన యువతకు తగిన ప్రోత్సాహం ఇవ్వడంతోపాటు వారి నైపుణ్యాన్ని మెరుగుపరుచు కునేందుకు అవసరమైన అన్ని సదుపాయాలను కల్పిస్తోందని చెప్పారు. ఒక ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి తద్వారా యువతి, యువకుల్లో నూతనోత్సాహాన్ని కల్పిస్తూ క్రీడా రంగం రాష్ట్రంలో మరింత పటిష్టంగా ఉండేలా అవసరమైన అన్ని చర్యలు ప్రభుత్వం తీసుకుంటోందన్నారు. పోటీల్లో గెలుపొందిన చిన్నారులకు ప్రసన్నకుమార్ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందిస్తున్న ఏపీ టిడ్కో చైర్మన్ ప్రసన్నకుమార్

ఘనంగా పితృదినోత్సవం



నిమ్మగడ్డ బుచ్చయ్యను సత్కరిస్తున్న మహిళా వాకర్స్ క్లబ్ సభ్యులు

మురళీనగర్: మురళీనగర్ పరిసర ప్రాంతాల్లో ఆదివారం పితృదినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మురళీనగర్, మాధవధార ప్రాంతాల్లోని సీనియర్ సిటిజన్స్, సేవా కార్యకర్తలను సత్కరించారు. వాకర్స్ క్లబ్ పూర్వ అధ్యక్షుడు నిమ్మగడ్డ బుచ్చయ్య(90), వాకర్స్ ఇంటర్నేషనల్ అదనపు సెక్రటరీ జనరల్ రాళ్లపల్లి సత్యనాథం, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు కేఎల్‌వీ ప్రసాదరావులను సత్కరించి పితృదినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు ఎం.శేషామణి, కార్యదర్శి సనపల పుష్పలత, పూర్వ అధ్యక్షులు కె.మాధవి, డి.శిరీష, గీతాభాను పాల్గొన్నారు.

విశేషంగా తిరువీధి



తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: అమావాస్య పురస్కరించుకుని సింహగిరిపై ఆదివారం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి విశేషంగా తిరువీధి జరిగింది. స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను పల్లకీలో అధిష్ఠంపజేసి సాయంత్రం సింహగిరి మాడ వీధుల్లో తిరువీధి నిర్వహించారు. భక్తులు విశేషంగా తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

జనరేషన్ యువ చిన్నారులకు వితరణ



ఆశ్రమ చిన్నారులతో సేవా సంఘం సభ్యులు

మురళీనగర్: మురళీనగర్‌కు చెందిన శ్రీ మణికంఠ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సేవా కార్యక్రమాలు నిర్వహించారు. జనరేషన్ యువ ఆశ్రమాన్ని సభ్యులు సందర్శించి అక్కడ ఆశ్రయం పొందుతూ విద్యనభ్యసిస్తున్న 24 మంది పిల్లలకు స్కూల్ షూస్ అందించారు. ఇందుకు అవసరమైన రూ.5,950 నగదులో సంఘ సభ్యులు వి.నాగేశ్వరరావు రూ.5000, మిగతా నగదును జి.శ్రీనివాసరావు, మణికంఠ సేవ సంఘం కలిసి అందించారు. కార్యక్రమంలో సేవా సంఘం అధ్యక్షుడు ఎం.రవికిరణ్, కార్యదర్శి ఆర్.గణపతిరావు, కోశాధికారి జీవీ ఆనందరావు, భాస్కరరావు, ఏఎస్ రావు, జీవీ మధుసూదనరావు, ఎస్.హరికుమార్, పి.పాపారావు, ఎస్‌వీఎల్ఎన్ స్వామి, వి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

భారీగా పెరిగిన విద్యుత్ వినియోగం

- షార్ట్‌అవుతున్న ట్రాన్స్‌ఫార్మర్లు
- విద్యుత్ సరఫరాకు అంతరాయం
- ఇబ్బంది పడుతున్న ప్రజలు

మల్కాపురం: అసలే అధిక ఉష్ణోగ్రతలు.. ఆ పై వడగాడ్పులు.. ఇంట్లో ఫ్యాన్లు తిరుగుతున్నా చమట కారుతూనే ఉంది. ఇలాంటి సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోతే ఆ బాధ వర్ణనాతీతం.అలాంటి కష్టాలు మల్కాపురం ప్రాంతానికి చెందిన పలువురు ఆదివారం ఎదుర్కొన్నారు. 61వ వార్డు మల్కాపురం పల్లివీధి,గొల్లవీధి తదితర ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 9 గంటల సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. తిరిగి ఉదయం 11.30 గంటలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో మళ్లీ విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. 4 గంటల సమయంలో ఇచ్చారు. మళ్లీ రాత్రి 6.30 గంటల సమయంలో సరఫరా నిలిచిపోయింది.ఇలా పలు మార్లు విద్యుత్ సరఫరాలో అంతరాయం నెలకొనడంతో పల్లివీధి,గొల్లవీధి తదితర ప్రాంత వాసులు ఉక్కిరి బిక్కిరయ్యారు. ఎండలు మండుతున్న వేళ గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిపివేస్తే ఎలా అని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లడానికి సంతకాలు సేకరించారు.



విద్యుత్ సరఫరా లేకపోవడంతో అంధకారంలో మల్కాపురం

వినియోగం రెట్టింపు కావడం వల్లే

ఇది ఇలా ఉంటే మల్కాపురం పల్లివీధి,గొల్లవీధి తదితర ప్రాంతాల్లో విద్యుత్ వినియోగం రెట్టింపు కావడం వల్ల ట్రాన్స్‌ఫార్మర్లు షార్టు అవుతున్నాయని, ఈ కారణంగా సరఫరాలో అంతరాయం నెలకుంటుందని అధికారులు వెల్లడిస్తున్నారు.

ఏఐవైఎఫ్ మహాసభలు ప్రారంభం

అల్లిపురం: అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) విశాఖ జిల్లా 11వ మహా సభలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సీపీఐ కార్యాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.లెనిన్‌బాబు ఏఐవైఎఫ్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన మహాసభలో ఆయన మాట్లాడారు. ప్రధాన మంత్రి మోదీ ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న హామీని పక్కన పెట్టి మత విద్వేష రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. రాష్ట్ర సహాయ కార్యదర్శి మహంకాళీ సుబ్బారావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని అమలు చేయలేదన్నారు. ఎస్వీ యూనివర్సిటీ మాజీ లెక్చరర్ క్షేత్రపాల్ మాట్లాడుతూ దేశంలోయువత భవిష్యత్తు, ఉద్యోగ, ఉపాధి కోసం ఏఐవైఎఫ్ జెండా చేతపట్టి సమరశీల ఉద్యమాలకు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు.



జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

సంప్రదాయ కళలను ఆదరించాలి

దాబాగార్డెన్స్: సంప్రదాయ కళలకు ప్రాధాన్యమివ్వాలని నృత్య కళాకారిణి ఏబీ బాలకొండలరావు అన్నారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నాట్య పరిమళ మ్యూజికల్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో సంగీతం, నృత్యంపై ఆదివారం నిర్వహించిన నైపుణ్య శిక్షణలో విజేతలుగా నిలిచిన వారికి ఆమె బహుమతులు అందజేశారు. సభాధ్యక్షుడు ఎంవీ రాజశేఖర్ మాట్లాడుతూ భారతీయ సనాతన సంప్రదాయంలో భాగమైన కళలను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. వంకాయల సన్యాసిరాజు సంస్థ ద్వారా కళా రంగానికి సేవలందిస్తున్న లిపికారెడ్డి, డాక్టర్ వై. బాలగణేష్‌ను అభినందించారు. కార్యక్రమంలో చెన్నా తిరుమలరావు, పి.శైలత కృష్ణ, సత్యనారాయణరెడ్డి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



కళాకారులకు బహుమతులు అందజేస్తున్న బాలకొండలరావు

సర్వ రోగ నివారిణి యోగా

అల్లిపురం: యోగా సర్వరోగ నివారిణిగా పని చేస్తుందని ప్రజాపిత బ్రహ్మ కుమారీస్ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం ప్రతినిధి బీకే రాజేశ్వరి అన్నారు. ఆదివారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆరు ముఖ్యమైన యోగాసనాలు, రెండు రకాల ప్రాణాయామాల గురించి వివరించారు. సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యుడు గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ అమెరికాలో జరిగే యోగా దినోత్సవంలో 180 దేశాలకు చెందిన ప్రతినిధులు పాల్గొంటారని వివరించారు. యోగా ద్వారా ఆరోగ్య పరిరక్షణ సాధ్యపడుతుందన్నారు. ఓంయోగా కేంద్రం ప్రతినిధి రమేష్ తదితరులు పాల్గొన్నారు.